క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ పాఠశాల పిల్లలకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. శుక్రవారం సిరిసిల్ల బీవైనగర్ ప్రైమరీ పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఫౌండేషన్ చైర్మన్ పి.ఉమాదేవి ఆధ్వర్యంలో బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆంజనేయులు, నవీన్, మల్లేశం, హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు రమేశ్, కవిత, మాధవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ అధికారులకు వినతి



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణు గోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయాలని కోరుతూ శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో ఎండోమెంట్ అధికారులను కలిశారు. ఆలయ పునర్ నిర్మాణంపై అధికారులకు వినతిపత్రం అందించారు. ఆలయ నిర్మాణం కోసం గత ప్రభుత్వం టీటీడీ సహకారంతో రూ. 3 కోట్లు మంజూరు చేశారు. పునర్నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయని అధికారులను అడుగగా, త్వరలో టెండర్లు పిలుస్తారని చెప్పినట్లు తెలిపారు. అధికారులను కలిసిన వారిలో ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ ననుగుల ఈశ్వర్, వైస్ చైర్మన్ ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు నంది కిషన్, లక్ష్మారెడ్డి, ఎలగందుల నర్సింలు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి: మద్యంతాగి వాహనాలు నడిపితే నడిపితే చర్యలు తప్పవని ఎస్సై దాస సుధాకర్ హెచ్చరించారు. మండలకేంద్రంలో గురువారం రాత్రి మద్యంతాగి వాహనాలు నడిపిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదుచేస్తామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



వేములవాడరూరల్: ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రమాదకర స్థలాలను గుర్తించగా మండలంలోని నాగాయపల్లితో పాటు పలు గ్రామాల్లో ఎస్సై మారుతి రబ్బర్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గడ్డివాములు దగ్ధం

చందుర్తి: మండలంలోని కిష్టంపేటకు చెందిన భామండ్ల బాబు అనే రైతుకు గడ్డివాములు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని శుక్రవారం దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బాబు డెయిరీఫాం నిర్వహిస్తున్నాడు. పాడి ఆవుల కోసం 600లకు పైగా గడ్డి కట్టలు కట్టించి పశువుల పాక వద్ద భద్రపర్చాడు. పంట చేలలో నిప్పంటించగా అది గాలులకు గడ్డివాముకు అంటుకుంది. గ్రామస్తులు, రైతులు విద్యుత్ మోటార్లతో నీరు చల్లి మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో రూ.50వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఘనంగా గంగమ్మ బోనాలు

రుద్రంగి: గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏరువాక, సత్యగంగ పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండలకేంద్రంలో గంగమ్మ బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర సంఘం మహిళలు ఇంటికో బోనంతో గ్రామంలో ఊరేగింపుగా గంగమ్మ తల్లి ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దేశవేని ధర్మేంధర్, ఉపాధ్యక్షుడు చిట్టపురం భూమయ్య, కార్యవర్గ సభ్యులు సిరికొండ రవీందర్, ఎల్ల ఎడ గంగాధర్, ద్యావల గణేశ్, చిట్టపురం రాజారాం, దేవేని నరేశ్, గడ్డం మహేందర్, సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



వేములవాడ : యోగాసనాలు వేస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు



రుద్రంగి: యోగా చేస్తున్న విద్యార్థులు



తంగళ్లపల్లి: కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు



గంభీరావుపేట: యోగా చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు



ముస్తాబాద్: ఆవునూర్ స్కూల్‌లో ..



ఎల్లారెడ్డిపేట: బొప్పాపూర్ జ్ఞానదీప్ పాఠశాలలో..

ఘనంగా యోగా దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. జిల్లాకేంద్రం, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని అన్ని మండలకేంద్రాలు, గ్రామాలు, పాఠశాలల్లో యోగాడే ను నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం, యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం యోగా దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో యోగా అభ్యాసకులు, ప్రజలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సిరిసిల్ల టౌన్ : ఇందిరాపార్కులో..

జిల్లాలో భారీ వర్షం



సిరిసిల్లలో కురుస్తున్న వర్షం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పలు దఫాలుగా మోస్తరు నుంచి భారీ వాన పడింది. లోతట్టు ప్రాంతాలైన పాతబస్టాండు, వెంకంపేట, కరీంనగర్ రోడ్డు, సంజీవయ్యనగర్, శాంతినగర్, రాళ్లబావి, ఆటోనగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో వరద నీరు పోటెత్తింది.

వేములవాడ: వేములవాడ పట్టణంలో వర్షం కురిసింది. సుమారుగా గంటసేపు భారీ వర్షం కురువగా 3 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షంతో రహదారులు జలమయ్యాయి.

నేడు మున్సిపల్ సమావేశం

సిరిసిల్లటౌన్: పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

సింగిల్‌విండో సొసైటీకి ఎరువుల బస్తాలు

సాక్షి స్పందన

చందుర్తి : చందుర్తి సింగిల్‌విండో సొసైటీకి కాంప్లెక్స్ ఎరువుల బస్తాలు శుక్రవారం చేరుకున్నాయి. ఈనెల 17న సహకారానికి దూరం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సీఈవో గంగారెడ్డి ఎరువుల బస్తాలను తెప్పించారు. సింగిల్‌విండో పరిధిలోని రైతులకు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆధార్ కార్డుతో పాటు పట్టాదారు పాసు పుస్తకాన్ని ఎరువుల బస్తాలను శనివారం నుంచి తీసుకెళ్లాలని సీఈవో తెలిపారు.



లారీలోంచి బస్తాలు దింపుతున్న కూలీలు

స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు ఆహ్వానం

సిరిసిల్లటౌన్: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ 2024–25 విద్యాసంవత్సరంలో రీజినల్ స్పోర్ట్స్ పరిధిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి రాందాస్ తెలిపారు. రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ హన్మకొండ, అథ్లెటిక్ అకాడమీ ఖమ్మం, సైక్లింగ్ ఓయూ క్యాంపస్, వాలీబాల్ అకాడమీ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, వాలీబాల్ అకాడమీ రాజన్న జిల్లాలో సీట్ల భర్తీకి జూలై 3,4 తేదీల్లో ఎంపిక జరుగుతాయని తెలిపారు. వివరాలకు 94402 39783లో సంప్రదించాలన్నారు.

బోయినపల్లి: స్పోర్ట్స్ స్కూల్స్‌లో నాలుగో తరగతి ప్రవేశాలకు ఈనెల 24న బోయినపల్లి హైస్కూల్ మైదానంలో విద్యార్థుల ఎంపిక నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాస దీక్షిత్ శుక్రవారం తెలిపారు.3వ తరగతి పాసై నాలుగో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు అర్హులన్నారు. 8 నుంచి తొమ్మిదేళ్ల వయస్సులోపు ఉండాలని పేర్కొన్నారు. సరైన ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. మరిన్ని హెడ్‌మాస్టర్, లేదా ఫిజికల్ డైరెక్టర్‌ను కలవాలని ఎంఈవో పేర్కొన్నారు.

చందుర్తి : మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు తెలిపారు. విద్యార్థులు 3వ తరగతి పాసై 4వతరగతిలో చేరి ఉండాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులతో లేదా పాఠశాల ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు ప్రధానోపాధ్యాయుడు శంకర్, వ్యాయామ ఉపాధ్యాయులను సంప్రదించాలని ఎంఈవో కోరారు.

రుద్రంగి: రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి ప్రవేశాలకు ఎంపికను మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ప్రారంభమవుతుందని మండల ఇన్‌చార్జ్ ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులు ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడిని సంప్రదించాలన్నారు. సూచించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బోయినపల్లి: కేంద్ర ప్రభుత్వం 15 రకాల పంటలకు మద్దతు ధర పెంచడంపై హర్షం వ్యక్తంచేస్తూ మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషస్తకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, నాయకులు ఎడపల్లి పర్శరాం, సుంకపాక ప్రభు, కొండం శ్రీనివాసరెడ్డి, ఓటారికారి లక్ష్మీరాజం, రాజూరి కిరణ్, అమిరిశెట్టి గంగయ్య, బొంగాని అశోక్, అనిల్, కిరణ్, ప్రదీప్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. గంభీరావుపేటలోని దోసలగూడెంకాలనీలో జెడ్పీ నిధులతో నిర్మించిన పశువులతొట్టిని కొందరు తమ స్వార్థం కోసం కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రఘు

కేటీఆర్ తీరుపై పెదవి విరుపు

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పర్యటన సందర్భంగాల్యే కేటీఆర్ తమ సమస్యలను వినకుండా వెళ్లిపోయారని పద్మశాలీ సంఘం పెద్దలు పెదవి విరిచారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మార్కండేయ ఆలయానికి వచ్చిన కేటీఆర్ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని మాట ఇచ్చారని పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మహిళా సంఘం అధ్యక్షురాలు కాముని వనిత తెలిపారు. ఆలయం ముందు ప్రైవేట్ స్థలాన్ని కూడా కొనిస్తామని హామీ ఇవ్వగా ఆచరణలోకి రాలేదన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యేను కలిసేందుకు వెళ్లగా పట్టించుకోలేదన్నారు. కేటీఆర్ గెలుపుకు కృషిచేసిన కృతజ్ఞత లేకుండా మాట్లాడకుండా వెళ్లారని ఆవేదన వారు వ్యక్తం చేశారు. కేటీఆర్‌తీరును ఖండిస్తున్నట్లు వారు తెలిపారు.



కేటీఆర్‌ను కలవడానికి వచ్చిన పద్మశాలీ సంఘం పెద్దలు

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

వేములవాడ: వేములవాడ పట్టణ బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు గోపన్నగారి మాధవిలత రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్యకు పంపినట్లు ఆమె తెలిపారు. వ్యక్తిగత కారణాలతో తాను పార్టీకి రాజీనామా చేసినట్లు ఆమె పేర్కొన్నారు.



వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల స్పెషల్ పార్టీ పోలీసులతో పాటు స్థానిక పోలీసులు సంయుక్తంగా శుక్రవారం రాత్రి మండల కేంద్రాన్ని దిగ్బంధించి పెద్ద ఎత్తున వాహన తనిఖీలు చేపట్టారు. పోలీస్‌స్టేషన్ ముందు సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు చేసి సరైన ధ్రువపత్రాలు లేని పది వాహనాలకు జరిమానాలు విధించారు. ఎస్సైలు రమాకాంత్, కిరణ్‌లు మాటాడారు. ఏఎస్సై కిషన్‌రావు, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత?

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అతనినుంచి గంజాయి స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

వాహన తనిఖీలు..

ఇల్లంతకుంట ఎస్సై రాజు ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్సై తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లికి చెందిన దప్పుల రాజవ్వకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆర్థిక సాయం అందించారు. రాజవ్వకు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన ఆపరేషన్ కావడంతో చికిత్స పొందుతోంది. రోజు రూ. 70 వేల వరకు వైద్యానికి ఖర్చుఅవుతోంది. రాజవ్వ భర్త పోచయ్య మృతిచెందగా, ముగ్గురు కూతుళ్లు సునీత, జ్యోతి దివ్య, ఇద్దరు కుమారులు అశోక్, ఖాసీం ఉన్నారు. వారి పరిస్థితి గురించి తెలుసుకున్న ఆది శ్రీనివాస్ రూ. 20 వేలు పంపించగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నాయకుడు పెంతల శ్రీనివాస్ బాధిత కుటుంబానికి అందజేశారు.

రుద్రంగి: మండలకేంద్రానికి చెందిన సుకినికంఠ చంద్రమోహన్ ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. రెండ్రోజుల క్రితం కడుపునొప్పి బాధపడుతుండగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందాడు. అక్కడివారు తలా కొంత జమచేసి అంబులెన్స్‌లో మృతదేహాన్ని రుద్రంగికి పంపించారు. మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆర్థికసాయం కోసం సాయం చేయాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేశారు. దాతలు రూ. 8,289, మిగతా డబ్బులు ట్రస్ట్ నిర్వాహకులు రూ.10వేలు బాధిత కుటుంబానికి అంత్యక్రియల కోసం అందించారు. మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మధు, మహేశ్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పాలాస రాజేందర్, తదితరులున్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

వీర్నపల్లి: ఎన్నికలలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు అన్నారు. సీపీఐ జిల్లా రైతు వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి జంగం అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుచేయాలన్నారు సామాజిక పింఛన్ నెలకు రూ. 4వేలు పెంచడం, మహిళలకు రూ.2,500 అందించాలన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ. 300 పెంచినట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో ఎక్కడా అమలుకావడం లేదన్నారు. 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. అనంతరం మండల సీపీఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా అడవి పదిర గ్రామానికి చెందిన మాట్ల అశోక్, సహాయ కార్యదర్శిగా గర్జనపల్లి గ్రామానికి చెందిన గజ్జల ప్రభాకర్, వీరితో పాటు 11 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డేవిడ్ రాజు, శంకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

ఎల్లారెడ్డిపేట: ఉపాధి కోసం మాల్దీవులకు వలస వెళ్లిన శీతల చంద్రయ్య (55) అక్కడ జరిగిన క్రేన్ ప్రమాదంలో సోమవారం మృతిచెందగా శుక్రవారం స్వగ్రామానికి మృతదేహం చేరింది. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన శీతల చంద్రయ్య ముంబైలోని అఫ్జాన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కంపెనీకి చెందిన కాంట్రాక్ట్ పనులు మాల్దీవులలో జరుగుతున్నాయి. చంద్రయ్య మాల్దీవుల్లో పనిచేస్తుండగా రెండు క్రేన్ల మధ్య ఇరుక్కొని ఈనెల 17న మృతిచెందాడు. ఈ విషయం కంపెనీ ప్రతినిధులు ఫోన్ ద్వారా చంద్రయ్య భార్య పోశవ్వకు తెలిపారు. నెల క్రితమే అన్న నర్సయ్య చనిపోగా అప్పుడు స్వగ్రామానికి వచ్చి ఇటీవల మాల్దీవులకు వెళ్లాడు. చంద్రయ్య మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మృతుడికి భార్య పోశవ్వ, కూతురు భాగ్యలక్ష్మి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



చంద్రయ్య (ఫైల్)

జయశంకర్‌కు ఘన నివాళి



ఎల్లారెడ్డిపేటలో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



ముస్తాబాద్‌లో..



వేములవాడఅర్బన్: నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముస్తాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని మండలకేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చింతోజు బా ల య్య, శివకేశవుల ఆలయ కమిటీ చైర్మన్ ఎల్సాని దే వ య్య, వెంకటేశ్, హరీశ్‌పంతులు, సతీశ్, చెవుల మల్లేశ్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని జెడ్పీటీసీ కార్యాలయంలో జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ మల్లేశం, నాయకులు నర్సింహారెడ్డి, కిషన్, నిమ్మల బాబు, శేఖర్, సత్తయ్య, దేవారెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నా రు.

బోయినపల్లి: మండలకేంద్రంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంఘం నాయకులు పాలోజు జగదీశ్వరాచారి, బోగోజి గంగాధర్‌చారి, రాజూరి కిరణ్, అక్కపెల్లి శంకరయ్య, రాజూరి రాములు, మొగులోజి రమేశ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఆలయంలో పూజలు

వేములవాడ: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 23నుంచి 27 వరకు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణోత్సవం గురువారం ఉదయం 11.55 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కోళ్ల వ్యాన్ బోల్తా.. తప్పిన ప్రమాదం

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధి బాలానగర్ వార్డు సమీపంలో శుక్రవారం కోళ్ల వ్యాన బోల్తాపడింది. వ్యాన్‌లో దాదాపు వెయ్యి కోళ్లు ఉండగా 500 కోళ్లు మృతి చెందినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ షరీఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీశారు. క్రేన్ సహాయంతో వ్యాన్‌ను అక్కడి నుంచి తొలగించారు.



మృతి చెందిన కోళ్లు